www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 16 మే 2024

కాటన్ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అపర భగీరథునిగా పేరొందిన కాటన్ ఈ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. బుధవారం కాటన్ జయంతిని ప్రజాకళాకారులు, రైతుల ఆధ్వర్యంలో తాడేరులో నిర్వహించారు. తొలుత కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎపి ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ మాట్లాడుతూ కాటన్ ధవళేశ్వరం వద్ద నిర్మించిన ఆనకట్ట మూలంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. కళాకారుడైన చాంద్‌భాషా మాట్లాడగా నేతలు ఎన్‌వి.సుబ్బారావు, ఎస్.విజయ్‌కుమార్, బిఎస్.ఆంజనేయశర్మ, శివ నాగరాజు, రామకృష్ణ, బాబ్జి, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, నాని తదితరులు పాల్గొన్నారు.

పందేల జోరు.. నేతలే నిర్వాహకులు..!

కౌంటింగ్ నాటికి రూ.వందల కోట్లు దాటే ఛాన్స్

ప్రజాశక్తి - కాళ్ల

పోలింగ్ ముగిసింది. కౌంటింగ్ మిగిలింది. ఈ నేపథ్యంలో పందేల జోరు మరింత ఊపందుకుంది. బెట్టింగ్‌రాయుళ్లు ఫలానా అభ్యర్థి గెలుస్తాడని, ఫలానా అభ్యర్థికి ఇన్ని ఓట్లు వస్తాయని, ఇంత మెజార్టీ వస్తుందని, ఫలానా పార్టీకి ఇన్ని ఓట్లు వస్తాయని ఇలా రకరకాలుగా బెట్టింగులు సాగుతుండటం విశేషం.

ఉండి అసెంబ్లీ స్థానంలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయనే అంశం మొదలుకుని కీలకమైన అభ్యర్థులు సాధించే మెజార్టీల వరకు అన్నింటిపైనా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. వేలల్లో, లక్షల్లో పందేలు సాగుతుండటం విశేషం. ఉండి నియోజకవర్గంలో టిడిపి కూటమి, వైసిపి అభ్యర్థుల విజయావకాశాలపై బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. దీంతో ప్రధాన పార్టీల, అభ్యర్థుల గెలుపోటములను విశ్లేషించేందుకు ఆయా పార్టీలవారీగా రాజకీయ నిపుణులు రంగంలోకి దిగారు. వీరు బూత్‌లవారీగా పోలైన ఓట్ల వివరాలు, వాటిలో యువత ఎంతమంది, మహిళలు ఎంత మంది అనే వివరాలు సేకరించి పార్టీలకు ఓట్లు ఎలా పడి ఉంటాయని అంచనాకు వస్తున్నారు. ఆయా బూత్‌ల్లో పార్టీలకు ఉన్న పట్టును కూడా పరిగణనలోకి తీసుకుని గెలుపోటములను అంచనా వేస్తున్నారు. బూత్‌లవారీగా లెక్కలు వేసుకుని ఒక అంచనాకు వచ్చిన తర్వాత బెట్టింగ్ కోసం సమాచారాన్ని పంపుతున్నారు. బెట్టింగ్ బాబుల్లో అధికశాతం ఈసారి ప్రధాన పార్టీల ద్వితీయశ్రేణి నాయకులే ఉండటం గమనార్హం. నియోజకవర్గ స్థాయిలో ఆయా పార్టీల్లో ముఖ్య నేతలుగా ఉన్నవారు కూడా బెట్టింగ్ నిర్వాహకులుగా వ్యవహరిస్తున్నారు. కేవలం ఉండిలో టిడిపి కూటమి, వైసిపికి చెందిన సుమారు వంద మందికిపైగా నేతలు బెట్టింగ్ వ్యవహారాలకు కేంద్రంగా మారడం గమనార్హం.

మధ్యవర్తులకు డబ్బే డబ్బు

ఈసారి బెట్టింగ్ కాసేవారు పక్కాగా వ్యవహరిస్తున్నారు. బెట్టింగ్‌కు ముందుకొచ్చిన వారు ముందుగా ఓ ఒప్పంద పత్రం రాసుకుంటున్నారు. ఇద్దరూ కలిసి ఒక నమ్మకమైన వ్యక్తి దగ్గర బెట్టింగ్ మొత్తాన్ని ఉంచుతున్నారు. ఫలితం తేలిన తర్వాత ఆ వ్యక్తి ఒప్పందం ఆధారంగా నగదును ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మధ్యవర్తులుగా ఉన్నవారికి భారీగానే గిట్టుబాటవుతోంది. పందెం మొత్తంలో 5 నుంచి 10 శాతం కమీషన్ రూపేణా మధ్యవర్తులకు అందజేయాలని ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఉండి నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు రూ.100 కోట్ల మేర బెట్టింగులు జరిగినట్లు అంచనా. ఫలితాలు వెలువడే నాటికి ఈ బెట్టింగులు రెట్టింపయ్యే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

బెట్టింగుల జోరు..

నరసాపురం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో బెట్టింగుల జోరు పెరిగింది. నరసాపురం టిక్కెట్ ఎవరికిస్తారనే దానిపై ఓ పార్టీలో పెద్దఎత్తున బెట్టింగులు సాగాయి. ఆ టిక్కెట్ విషయం తారుమారు కావడంతో చాలామంది దెబ్బతిన్నారు. తాజాగా పోలింగ్ ముందు నుంచి బరిలో ఉన్న అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగులు సాగుతున్నాయి. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది, నరసాపురంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుపొందుతారు, ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి, ఎంత మెజార్టీ వస్తుంది, పవన్ పోటీలో ఉన్న పిఠాపురంలో ఎంత మెజార్టీ వస్తుందనే దానిపై పందేలు సాగుతున్నాయి. ఇప్పటికే చాలామంది బాండ్ పేపర్‌లపై, పెద్ద మనుషుల సమక్షంలో అగ్రిమెంట్‌లు రాసుకుంటున్నారు. జూన్ 4న లోపు బెట్టింగులు మరింత పెద్దఎత్తున సాగే అవకాశం ఉందని తెలుస్తోంది.

స్ట్రాంగ్‌రూముల వద్ద మూడంచెల భద్రత

జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం

స్ట్రాంగ్ రూములు వద్ద మూడంచెల భద్రత 24 గంటలు కొనసాగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. ఉండి, భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల ఇవిఎంలను భద్రపర్చిన స్థానిక ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్స్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని పేర్కొన్నారు. స్థానిక పోలీసులు, రిజర్వు పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు స్ట్రాంగ్‌రూముల వద్ద పహారా కాస్తున్నాయని, ఎలాంటి అగ్నిప్రమాదాలకూ అవకాశం లేకుండా అగ్నిమాపక అధికారులు, పరికరాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూముల దగ్గర ఒక డిఎస్‌పి పర్యవేక్షణలో ఒక సిఐ, నలుగురు ఎస్ఐలతో పాటు ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

పోలీసు సాయుధ బలగాల రక్షణలో స్ట్రాంగ్ రూమ్

ఓటెవరికో..!

ఆసక్తికరంగా పాలకొల్లు రాజకీయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో రాజకీయం ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని టిడిపి అభ్యర్థి నిమ్మల రామానాయుడు జోరు సాగించగా టిడిపి కోటను ఎలాగైనా బద్దలు కొట్టాలని వైసిపి అభ్యర్థి గుడాల గోపీ పట్టుదలగా ప్రచారం సాగించారు. పోలింగ్ పూర్తయ్యి ఓటర్ల తీర్పు ఇవిఎంల్లోకి చేరింది. ఈ నేపథ్యంలో పాలకొల్లులో విజయం ఎవరిదనే దానిపై ఇరు పార్టీల నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. మొత్తం లక్షా 95 వేల 57 మంది ఓటర్లకుగాను 1,60,842 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 80,038 మంది, మహిళలు 80,881 మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో ఓటింగ్ సరళిపై ఎవరికి వారు తమదైన రీతిలో విశ్లేషించుకుంటూ అంచనాలు ప్రకటిస్తున్నారు. టిడిపి మరోసారి గెలిచి తీరుతుందని, మెజార్టీ సైతం గతం కంటే పెరుగుతుందని ఆ పార్టీ నేతలు పందేలు కడుతున్నారు. వైసిపి గెలుస్తుందని పందేలు సాగుతున్నా మెజార్టీపై మాత్రం పందేలు కట్టడం లేదు. ప్రధానంగా గతంలో చేసిన అభివృద్ధి, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో ముందుండటం, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండటం వంటి అంశాలు తమను గెలిపిస్తాయని టిడిపి నేతలు చెబుతున్నారు. టిడిపిలో గ్రూపు విభేధాలు లేకపోవడం ఆ పార్టీకి కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. ఇక వైసిపి అభ్యర్థి గుడాల గోపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా నియమితులైనప్పటి నుంచి ఏదోక రూపంలో ప్రజలతో మమేకమయ్యే ప్రయత్నం చేశారు. ఈసారి ఎలాగైనా టిడిపిని ఓడించాలనే కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నట్లు ఆయన పదేపదే ప్రకటించారు. ఈయన బాధ్యతలు చేపట్టాక ఆ పార్టీని పట్టిపీడిస్తున్న గ్రూపు విభేధాలు పైకి కన్పించకపోయినా లోలోన మాత్రం కొనసాగడం ఆ పార్టీకి పెద్ద మైనస్‌గా రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. దీనికితోడు ఓటుకు నోటు పంపిణీ కూడా ఇరు పార్టీల గెలుపోటములను ప్రభావితం చేయబోతున్నాయనే అంచనాలు ఉన్నాయి. ఇరు పార్టీలూ నగదు పంపిణీ చేసినా అధికార పార్టీ అభ్యర్థి నగదు పంపిణీ క్షేత్రస్థాయిలో సరిగా సాగకపోవడంతో వ్యతిరేకత వ్యక్తమైనట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు వైసిపికి ఏ మేరకు నష్టం చేకూరుస్తాయననే ఆందోళన ఆ పార్టీ శ్రేణుల్లో ఉంది. ఈ నేపథ్యంలో ప్రముఖ నటుడు మెగాస్టార్ చిరంజీవినే ఓడించిన పాలకొల్లులో గెలుపెవరిది అనే అంశంపై సర్వత్రా పెద్దఎత్తున చర్చ సాగుతోంది.

గూడెంలో గెలుపెవరిదో..!

ఎవరి అంచనాలు వారివే

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మొత్తం 2,14,985 మంది ఓటర్లు ఉండగా వారిలో మొత్తం 1,75,594 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 87,123 మంది, మహిళలు 88,462 మంది ఉన్నారు. ఎన్నికల్లో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో త్రిముఖ పోటీ ఉన్నప్పటికీ ప్రధానంగా వైసిపి, జనసేన మధ్య పోటీ నెలకొంది. వైసిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్‌ఎ కొట్టు సత్యనారాయణ డిప్యూటీ సిఎంగానూ ఉన్నారు. పోలింగ్ సరళి వైసిపికే అనుకూలంగా ఉందని, ప్రజలు తమ ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉన్నారని కొట్టు సత్యనారాయణ ధీమాతో ఉన్నారు. అయితే డిప్యూటీ సిఎం పదవి దక్కినా నియోజకవర్గంలో పెద్దగా అభివృద్ధి పనులు చేపట్టలేదనే విమర్శలు ఉన్నాయి. పైగా మంత్రి పేరిట అవినీతి దందా పెరిగిందనే ఆరోపణలు పెద్దఎత్తున ఉన్నాయి. ఇవన్నీ వైసిపికి కొంత ఇబ్బందేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక కూటమి అభ్యర్థిగా జనసేన నుంచి బొలిశెట్టి శ్రీనివాస్ రంగంలో ఉన్నారు. ఈయన గతంలో తాడేపల్లిగూడెం మున్సిపల్ ఛైర్మన్‌గానూ పని చేశారు. గత ఎన్నికల్లో ఓటమి సానుభూతితోపాటు ఈ ఎన్నికల్లో టిడిపి బలం తోడవ్వడంతో విజయం ఖాయమని శ్రీనివాస్ ఘంటాపథంగా చెబుతున్నారు. ప్రజారాజ్యం స్థాపించాక ఆ పార్టీ అధినేత చిరంజీవి జిల్లాలోని పాలకొల్లు నుంచి పోటీ చేసి ఓటమి పాలైన సంగతి తెలిసిందే. అయితే అదే సమయంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పిఆర్‌పి తరపున ఈలి నాని గెలుపొంది రికార్డు సృష్టించారు. మరి ఈ ఎన్నికల్లో జనసేనను గెలిపించి మరోసారి సంచలనాల కేంద్రంగా ఉంటుందో, లేక డిప్యూటీ సిఎం తన సిట్టింగ్ స్థానాన్ని వైసిపి నిలబెట్టుకుంటుందో జూన్ 4 వతేదీ వరకూ వేచిచూడాల్సిందే.

ఉచిత కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అల్లూరి సీతా రామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని వసుధ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాదరాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టు శిక్షణా కేంద్రాన్ని మెంటేవారితోటలోని స్థానిక మహిళలు, యువత ఉపయోగించుకోవాలన్నారు. ఈ కేంద్రంలో కుట్టు మిషన్, కటింగ్, ఎంబ్రాయిడరీ నేర్పనున్నట్లు తెలిపారు. అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం మాట్లాడుతూ ఈ సేవాకేంద్రంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత వైద్య సహాయ కేంద్రం, డయోగ్నస్టిక్ సెంటర్, జనరిక్ మందులషాపు, ఆక్యుప్రెజర్, ఉచిత మెడికల్ క్యాంప్స్, మజ్జిగ చలివేంద్రాలు ఈ విధంగా అనేక కార్యక్రమాలు దాతల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగానే ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని మెంటే వారితోటలోని మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రారంబించామన్నారు. ఇది మంచి అవకాశంగా భావించి మహిళలు ఈ వినియోగించుకోవాలని కోరారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వసుధ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ప్రసాద్ రాజు

రైతులకు గోనె సంచులివ్వాలని వినతి

ప్రజాశక్తి - నరసాపురం

ధాన్యం పట్టుబడి కోసం రైతులకు గోనె సంచులు ఇచ్చి, ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు కోరారు. ఈ మేరకు నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో వరి రైతులకు సంచులు లేక, ధాన్యం కొనుగోలు చేయక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మారిన వాతావరణ మార్పులు కారణంగా అకాల వర్షాలు పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే సంచులు ఇచ్చి ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న రామరాజు

సుందరయ్య అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

సిఐటియు జిల్లా కమిటీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని సిఐటియు ఏలూరు జిల్లా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక సమావేశంలో పాల్గొన్నారనే కారణంతో ఒక పత్రికలో వచ్చిన వార్తను సాకుగా చూపి ఎన్నికల నియమావళి ఉల్లంఘించారనే పేరుతో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ అధికారులు సస్పెండ్ చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల సమావేశంలో పాల్గొనడం మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పరిధిలోకి రాదని, అయినా యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని విమర్శించారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులకు ఓటు వేయమని ప్రేరేపించడం, రాజకీయ పార్టీల తరపున ప్రచారం చేయడం తదితర అంశాలు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. అటువంటి అభియోగాలు ఏమీ లేకుండా దురుద్దేశపూర్వకంగా జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ అధికారులు సుందరయ్యను అక్రమంగా సస్పెండ్ చేశారని ఆరోపించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎటువంటి ఆదేశాలూ ఇవ్వక పోయినా కుట్ర పన్ని ఇటువంటి చర్యలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు జిల్లా అధికారులు చేసిన తప్పుడు సస్పెన్షన్‌పై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అధికారులు చేసిన అక్రమ సస్పెన్షన్ తక్షణమే ఎత్తివేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకొని సస్పెన్షన్ ఎత్తివేసి సుందరయ్యను విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ భీమవరం ఎంఎల్‌ఎ అభ్యర్థి అంకెం సీతారామ్

సిపిఎం సహకారం మరువలేనిది

కాంగ్రెస్ అభ్యర్థి అంకెం సీతారామ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తన గెలుపు కోసం సిపిఎం నాయకులు చేసిన ప్రచారం. చేసిన కృషి మరువలేనిదని ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ భీమవరం ఎంఎల్‌ఎ అభ్యర్థి అంకెం సీతారామ్ అన్నారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయానికి ఆయన వెళ్లి సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాంను, నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో వైసిపిని సాగనంపడానికి ఇండియా వేదికలో భాగస్వామిగా ఉన్న సిపిఎం భీమవరంలో తన ప్రచారానికి ఎనలేని సహకారం అందించిందన్నారు. పేదల పక్షపాతి సిపిఎం అని అభివర్ణించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ మతోన్మాదశక్తులను రెచ్చగొడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి ఇండియా వేదిక మరింత పోరాడాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠం, కాంగ్రెస్ నాయకులు రామరాజు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్స్ వద్ద 144 సెక్షన్

జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు స్ట్రాంగ్‌రూమ్స్ వద్ద కిలోమీటరు పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల తెలిపారు. స్థానిక ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల, విష్ణు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇవిఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూములను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్ర పోలీస్ బలగాలు, జిల్లా ఆర్మ్డ్ పోలీస్, సివిల్ పోలీస్ బందోబస్తును పరిశీలించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. స్ట్రాంగ్ రూమ్స్ నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయని, ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్‌పి తెలిపారు. ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న ఎస్‌పి అజిత వేజెండ్ల

జ్ఞాపిక టివిఎస్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరంలోని శాంతినగర్‌లో జ్ఞాపిక టివిఎస్ షోరూమ్‌ను నేషనల్ టివిఎస్ సేల్స్ మేనేజర్ కులదీప్‌శర్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కులదీప్‌శర్మ మాట్లాడుతూ టివిఎస్ అనేది ఒక మంచి బ్రాండ్ అని, ఇందులో చాలా కొత్త కొత్త మోడల్స్ వచ్చాయని తెలిపారు. ఏరియా మేనేజర్ శివ భరద్వాజ్ మాట్లాడుతూ సేల్స్, స్పేర్ పార్ట్స్ కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు.

నేటి నుంచి గురుకులాల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్

ప్రజాశక్తి - భీమడోలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి సన్నాహాలు పూర్తి చేసినట్లు జిల్లా సమన్వయకర్త ఎన్.భారతి తెలిపారు. దీనిలో భాగంగా 16, 17 తేదీల్లో పొలసానిపల్లి బాలికల గురుకుల జూనియర్ కళాశాల వేదికగా కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో ర్యాంకులు సాధించిన వారికి ఆన్‌లైన్ విధానంలో సీట్ల కేటాయింపు జరిగిందన్నారు. ఇంకా బాలుర విభాగంలో మిగిలిన 140 సీట్లు భర్తీ కావాల్సి ఉందన్నారు. ఇక బాలికల విభాగం కింద 122 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని భర్తీ చేసేందుకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నామన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యేవారు గతంలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష హాల్ టికెట్, ర్యాంకు కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు పదో తరగతి మార్కులు షీటు, ఆధార్ కార్డుతో హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో బాలురకు ప్రత్యేకించిన పెదవేగి, ఆరుగొలను, నరసాపురం జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల 16న, బాలికలకు ప్రత్యేకించిన పొలసానిపల్లి, వట్లూరు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, నూజివీడు జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల 17న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కౌన్సెలింగ్ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని జిల్లా సమన్వయకర్త తెలిపారు.

అవగాహనలేమితోనే తలసేమియా కేసుల పెరుగుదల

చిన్నపిల్లల వైద్య నిపుణురాలు వీణ అక్కినేని

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తల సేమియా భవనంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ విజయవాడ వారిచే తలసేమియా వ్యాధిపై బుధవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లల వైద్య నిపుణురాలు, కన్సల్టెంట్ పీడియాట్రిక్ హేమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ వీణ అక్కినేని మాట్లాడుతూ దేశంలో తలసేమియా కేసులు పెరగడానికి ముఖ్య కారణం ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడమేనని, ఆరు నెలల నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నట్లయితే వైద్యుల సలహాతో తలసేమియా, హిమోఫిలియా వంటి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. తలసేమియా వ్యాధి పిల్లలకు బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ పరిష్కారం ఉన్నప్పటికీ మ్యాచింగ్ దాత దొరకాలని, ఇది ఖర్చుతో కూడుకున్నప్పటికీ స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం సహకారంతో చేస్తున్నామని చెప్పారు. అనంతరం తల సేమియా చిన్నారులను పరీక్షించి, మందులను సూచించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది సుమారు పదివేల మంది తలసేమియా మేజర్‌తో పుడుతున్నారని, అలాంటివారు జీవితాంతం నిరంతర రక్తమార్పిడి, మందులను వాడాల్సిందేనని చెప్పారు. తలసేమియా చిన్నారులకు రెడ్ క్రాస్ సొసైటీ అండగా ఉంటుందని కృష్ణారెడ్డి అన్నారు. తలసేమియా స్క్రీనింగ్ క్యాంపునకు హాజరైన తలసేమియా చిన్నారులకు వారి తల్లిదండ్రులకు 150 మందికి భోజనాన్ని ఏర్పాటు చేసిన మానవత విద్యా నిధి కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు జెవి.ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ స్పందన, మానవత విద్యానిధి కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, ఆలపాటి వెంకట లక్ష్మీప్రసన్న, లావేటి శ్రీను, పిఆర్ఒ కెవి.రమణ, విజయవాడ రెయిన్ బో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి

31 వరకు నరసాపురం - గుంటూరు ఫాస్ట్ రద్దు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు నరసాపురం-గుంటూరు మధ్య నడిచే ఫాస్ట్ పాసింజర్ రైలును అధికారులు రద్దు చేశారు. దీంతోపాటు నరసాపురం నుండి ఉదయం 10 గంటలకు నడిచే విజయవాడ పాసింజర్, రాత్రి 8 గంటలకు రాజమండ్రి వెళ్లే నర్సాపూర్-రాజమండ్రి పాసింజర్ రైళ్లనూ రద్దు చేశారు. ఈ రైళ్ల తిరుగు ప్రయాణం అంటే గుంటూరు-నరసాపురం, విజయవాడ-నరసాపురం, రాజమండ్రి-నరసాపురం రైళ్లు సైతం రద్దయ్యాయి. గుంటూరు వద్ద ట్రాక్ మరమ్మతులు కారణంగా ఈ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారి ఒకరు వెల్లడించారు. గతంలో ఎక్కువ నెలలు ఈ రైళ్లను రద్దు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంతకాలం నరసాపురం నుండి గుంటూరుకు రైలు రద్దు చేసినా విజయవాడ సమీపంలోని నిడమనూరు, రామవరప్పాడు వరకు రైలు నడిపారు. ప్రస్తుతం కూడా ఈ రైళ్లను విజయవాడ సమీపంలో రామవరప్పాడు, నిడమనూరు వరకైనా నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

కాటన్ విగ్రహానికి నివాళు లర్పించిన ఎఇ జయశంకర్, సిబ్బంది

సర్ ఆర్థర్ కాటన్ ధన్యజీవి

ప్రజాశక్తి - పెనుమంట్ర

కృష్ణా, గోదావరి నదుల నీరు వృథాగా సముద్రం పాలు కాకుండా బ్యారేజీల నిర్మాణం చేపట్టి ఈ ప్రాంతాలను సస్య శ్యామలం చేసిన సర్ ఆర్దర్ కాటన్ ధన్యజీవి అని ఇరిగేషన్ ఎఇ గుబ్బల జయశంకర్ అన్నారు. బుధవారం కాటన్ 221వ జయంతి వేడుకలు మార్టేరు ఇరిగేషన్ కార్యాలయం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మార్టేరు ఇరిగేషన్ లాకుల వద్ద నెలకొల్పిన కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సహాయకులు ఎన్.బాబులు, సిహెచ్ఎస్ఆర్ఎస్.శర్మ, లాక్ సూపరింటెండెంట్ జోసఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నిమ్మల రామానాయుడు

పాలకొల్లు: అధికారంలోకి రాబోయే టిడిపి కూటమి రైతు ప్రభుత్వంగా పని చేస్తుందని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. సర్ ఆర్దర్ కాటన్ జయంతి సందర్భంగా తెలుగు రైతు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక లాకుల వద్ద ఉన్న ఇరిగేషన్ కార్యాలయ ప్రాంగణంలో నిలువెత్తు కాటన్ విగ్రహానికి రైతులతో కలిసి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల్లో పట్టెడన్నం తింటున్నామంటే కాటన్ మహాశయుని చలవేనన్నారు. అటువంటి మహనీయుడిని జీవితంలో మర్చిపోలేమన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు ఉంగరాల నరసింహారావు, పెచ్చెట్టి బాబు, అల్లు రాధాకృష్ణ, జివి, కోడి విజయభాస్కరరావు, మామిడిశెట్టి పెద్దిరాజు, కడలి గోపాలరావు, బోళ్ల సుభాష్‌చంద్రబోస్, కొండ్రెడ్డి సూరిబాబు, ఇంటి శ్రీరామ్మూర్తి, అందే కోటి వీరభద్రం, దొంగ బాబాయ్, తాళ్లూరి సత్య శ్రీనివాసరావు, బోనం నాని, చెరుకూరి అంజి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన పాలకొల్లు ఛాంబర్ కళాశాల విద్యార్థులు

'జీల్'కు 14 మంది ఛాంబర్స్ విద్యార్థులు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక బిఆర్ఆర్ అండ్ జికెఆర్ ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం జీల్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలకు 58 మంది హాజరవ్వగా 14 మంది ఎంపికయ్యారు. వీరికి జీతం ఇతర అలవెన్స్‌లు కలిపి రూ.22 వేలు ప్రతినెలా వేతనం లభిస్తుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంటర్వ్యూ అనంతరం ఎంపికైన విద్యార్థులకు కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు చేతుల మీదుగా ఆఫర్ లెటర్స్ అందించారు. కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు మాట్లాడుతూ విద్యాభ్యాసం అనంతరం ఉద్యోగ అన్వేషణలో ఉన్న విద్యార్థుల సౌకర్యంగా ఈ ప్రాంగణ ఎంపికలు తమ కళాశాలలో చేపట్టడం ఆనందదాయకంగా ఉందని చెప్పారు.

బాధితునికి సహాయం అందజేస్తున్న అంజిబాబు

బాధితునికి జనసైనికుల సాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి జన సైనికులు ముందుకు రావడం అభినందనీయమని మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బుధవారం భీమవరం 17వ వార్డు బంట్రోతువారివీధికి చెందిన క్షతగాత్రునికి జనసైనికులు రూ.37 వేలు సహకారం అందించారు. 17వ వార్డుకు చెందిన ఉద్దిసి వాసు ఇటీవల తాడేపల్లిగూడెం వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. ఆయనకు జన సైనికులు రెడ్డి సత్తిబాబు, కొప్పినీడి శ్రీను, సంగినేడి వెంకటేశ్వరరావు, ఆముదాలపల్లి సాయినాథ్, గాడి శివప్రసాద్, బుసుపు శ్రీను, చెన్నంశెట్టి వినయ్ రూ.37 వేలు నగదు అంజిబాబు చేతుల మీదుగా అందించారు.


వెంకటేశ్వర స్వామి ఆలయం

17 నుంచి కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులోని ప్రసిద్ధ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కళ్యాణోత్సవాలు ఈ నెల 17న శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. కల్యాణోత్సవాలకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని ఆలయ ఇఒ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ ప్రాంగణం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేశామన్నారు. 19న స్వామివారి కళ్యాణం, 23న రథోత్సవం, 26 నుంచి 28 వరకు వళాయితీ ఉత్సవాలు జరుగుతాయన్నారు. జూన్ 1న అఖండ అన్నసమారాధన జరుగుతుందని ఆలయ ఇఒ ఎం.అరుణ్‌కుమార్ బుధవారం తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

తినాలంటే ఇష్టం.. కొనాలంటే కష్టం..

మామిడికాయలు, నిత్యావసర ధరల పెరుగుదలతో ఆవకాయ ప్రియుల ఆందోళన

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆవకాయ.. ఈ మాట వింటే చాలు నోటిలో నీళ్లూరాల్సిందే.. వేడివేడి అన్నంలో ఆవకాయ వేసుకుని తింటే ఆహా ఏమి రుచి అనాల్సిందే.. అయితే మామిడి కాయలతో పాటు, నిత్యావసరాల ధరలు పెరగడంతో ఆవకాయ పెట్టాలంటే భయపడుతున్నారు.

మార్కెట్లోకి ఆవకాయ, మాగాయ పెట్టే రకరకాల మామిడికాయలు వచ్చాయి. పరిసర ప్రాంతాల్లో ఈ కాయలకు మండలంలో మార్టేరు మార్కెట్ ప్రసిద్ధి. ఇక్కడకు వారం రోజులుగా ఆవకాయ పెట్టడానికి దేశవాళీ, కొత్తపల్లి కొబ్బరి, సువర్ణ రేఖ, చిన్న రసాలు, ఐజర్లు రకాలతో పాటు, మాగాయ పచ్చడికి అవసరమైన పెద్ద రసాలు, చిన్న రసాలు వంటి కాయలు ఎక్కువగా వస్తున్నాయి. అయితే నేడు ఈ కాయలు కొనాలంటే కాసుల పేర్లు అమ్ముకోవాల్సిందే అంటున్నారు వినియోగదారులు. ఆవకాయ పెట్టడానికి ఎక్కువ మంది ఇష్టపడే ఐజర్లు ధర కొండెక్కి కూర్చున్నదే చెప్పాలి. ఈ రకం మామిడికాయ ఓ మాదిరి సైజు ఉంది. ఒక్కొక్కటీ 45 రూపాయల ధర పలుకుతుంది.

ఈ లెక్కన వంద కాయలకు రూ.4,500 అవుతుంది. వీటిని ముక్కలు కొట్టించడం కోసం పెట్టే వ్యయం, మెంతులు, ఆవాలు, కళ్లుఉప్పు, పెద్ద సైజు వెల్లుల్లి, పచ్చికారం, పప్పు నూనెలకు పెట్టే అదనపు ఖర్చుతో కలుపుకుంటే వందకాయలు ఆవకాయకు పన్నెండు వేల రూపాయలకు మించి వెచ్చించాలని పచ్చడి ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్లోకి వచ్చిన మామిడికాయలు

ఆంధ్రులకు అత్యంత ఇష్టమైన ఆవకాయతోపాటు మాగాయకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ పచ్చడి కోసం చిన్నరసాలు, పెద్దరసాలు వినియోగిస్తారు. కాయ 25 రూపాయలు ధర పలుకుతోంది. అవికూడా ప్రస్తుతం దొరకని పరిస్థితి. జాగ్రత్తగా చూసుకుంటే ఈ పచ్చడి ఏడాది కాలానికి మించి నిల్వ ఉంటూ, పాత మాగాయిగా రుచి పుట్టిస్తుంది. మామిడి కాయ, కారం, నూనె, వెల్లుల్లి ధరలు ఆకాశంలో ఉన్నా, ఆవకాయ, మాగాయ పట్టని తెలుగు ఇళ్లు బహు తక్కువనే అనాలి. అప్పు చేసైనా ఈ పచ్చళ్లు పెట్టడం అందరికీ ఆనవాయితీ అనే చెప్పాలి.

కాయ కొట్టడం ఒక కళ..

మామిడికాయల్ని ఆవకాయ కోసం ముక్కలుగా కొట్టడం ఒక కళ అనొచ్చు. శుభ్రంగా నీటిలో కడిగి, పొడిగుడ్డతో తడి లేకుండా తుడిచిన కాయలను సైజు బట్టి నాలుగు, ఆరు, ఎనిమిది ముక్కలుగా కొడతారు. ఈ సీజన్లో ఇలా ముక్కలు కొట్టే పని ఎక్కువగా మహిళా కార్మికులే చేస్తుంటారు. కాయ కొడుతుంటే ముక్క నలగకుండా కొట్టడం వీరి ప్రత్యేకత.


మామిడికాయలు ముక్కలు కొడుతున్న మహిళ

ఇందుకు కాయకు మూడు రూపాయలు తీసుకుంటారు. ఏడాదికి ఒకసారి పెట్టే పచ్చడికి కొట్టించే కాయలకు బేరసారాలు ఆడకుండా అడిగినంతా ఇవ్వడం ఇక్కడ కొసమెరుపు. ఏది ఏమైనా ఎంత ధర అయినా సరే ఏటా వేసవిలో ఆవకాయ పెట్టనివారుండరంటే అతిశయోక్తి కాదు.

తాటి ముంజులకు గిరాకీ

ప్రజాశక్తి - కాళ్ల

వేసవి రాకతో భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఎండల తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయితే వేసవిలో మాత్రమే లభించే తాటి ముంజులను కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. వేడి వాతావరణంలో తాటి ముంజులు ఉపశమనం కలిగిస్తాయని వైద్యులు సూచిస్తున్నారు. శరీరంలో లవణాలు, పోషకాలను పోనీయకుండా వేసవి తాపం నుంచి తాటి ముంజులు ఉపశమనం కలిగిస్తాయంటున్నారు. దీంతో వీటికి గిరాకీ పెరిగింది. వేసవిలో ఏప్రిల్, మే నెలల్లో ఈ వ్యాపారం జోరుగా సాగుతుంది.

ఇక ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్న ఈ తాటి ముంజులు తినడానికి చాలా మంది ఇష్టపడుతుంటారు. వాటిని ఎంతో మంది ఇష్టంగా తింటారు. అయితే డయాబెటీస్ ఉన్నవారు తాటి ముంజులు తినొచ్చా లేదా అని ఆలోచిస్తుంటారు. మండలంలోని పలు ప్రధాన గ్రామాల కూడలితో పాటు పలు గ్రామాల్లో కొంతమంది ప్రజలు తాటి ముంజులు జీవనోపాధి పొందుతున్నారు.

ఏలూరుపాడు, జువ్వలపాలెం, దొడ్డనపూడి, కాళ్ల, సీసలి, జక్కరం, పెదఅమిరం గ్రామాల్లో తాటి ముంజుల వ్యాపారం జోరుగా సాగుతోంది. తాటి ముంజులు డజను 50 రూపాయలకు విక్రయిస్తున్నారు.

తాటి ముంజులు విక్రయిస్తున్న వ్యక్తి

వాటిలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా క్యాలరీలు తక్కువగా ఉండటం వల్ల కాల్షియం, ఫైటో న్యూట్రియెంట్స్, విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. వీటిని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు వైద్యులు. తాటి ముంజులను సమ్మర్‌లో తినడం వల్ల డీహైడ్రేషన్ సమస్యల నుంచి బయటపడొచ్చు. వికారం, వాంతులు వంటి లక్షణాల నుంచి కూడా ఉపశమనం కలుగుతుంది. అంతేకాకుండా డయాబెటీస్ రోగులకు కూడా ఇది మంచి చేస్తుంది.

ప్రకృతివరం తాటిముంజులు..

వేసవిలో ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు తాటి ముంజులు ఎంతగానో ఉపయోగపడతాయి. తాటిముంజు మనిషికి ఎంతగానో మేలు చేస్తుంది. మనిషి శరీరంలోని ఉష్ణోగ్రత తగ్గి జీర్ణక్రియ బాగా జరుగుతుంది. శరీరానికి మంచి చల్లదనాన్ని అందిస్తుంది. చిన్నారులకు, పెద్దలకు, సుగర్ వ్యాధిగ్రస్తులకు, స్థూలకాయులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆరోగ్యానికి దోహదం చేయడంతో పాటు దాహార్తికి కూడా మంచి విరుగుడు, తాటిముంజులో ఎక్కువ మొత్తంలో శరీరానికి కావాల్సి శక్తినిస్తుంది.

ఉంగుటూరులో ఉత్కంఠ పోరు

నువ్వా నేనా అన్నట్లు వైసిపి, జనసేన మధ్య పోటీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయ్యింది. గెలుపు ఎవరనేది ఇవిఎంల్లో ఓటర్లు నిక్షిప్తం చేశారు. జూన్ నాలుగో తేదీన వాటి ఫలితాలు వెల్లడి కానున్నాయి. అయితే గెలుపు తమదంటే తమదేనంటూ ఇరుపక్షాలు వారి వారి పోల్ మేనేజ్‌మెంట్ అంచనాల్లో నేతలు, అభ్యర్తులు తలమునకలై ఉన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 2,06,437 మంది ఓటర్లుకు 1,81,156 (87.75 శాతం) మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏలూరు జిల్లాలో ఇదే అత్యధికం. 2019 ఎన్నికల్లో 2,00,216 ఓట్లకు 1,73,840 ఓట్లు పోలయ్యాయి. (80.12 శాతం) గతం కంటే భిన్నంగా ఈసారి దాదాపు ఏడు శాతం ఓట్లు



పెరిగాయి. అంటే 2024 నాటికి పెరిగిన కొత్త ఓటర్లతో కలుపుకుని 7,316 ఓట్లు అధికంగా పోలయ్యాయి. ఇలా అదనంగా పోలైన ఓట్లు తమకే అనుకూలంగా ఉంటాయని ప్రధాన రాజకీయ పార్టీలు వైసిపి, జనసేన నాయకులు లెక్కలు వేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఎన్ఆర్ఐలు, ప్రభుత్వ, ఇతర ఉద్యోగులు, యువత, నిరుద్యోగులు, బలమైన సామాజిక తరగతి ఓటర్లు తమవైపే ఉన్నారని కూటమి నాయకులు ఆశాభావంలో ఉన్నారు. బిసిలు, ఎస్‌సిలు, బడుగు, బలహీన వర్గాలు, పెన్షనర్లు, పథకాలు అందుకున్నవారు తమవైపే ఉన్నారని అధికార పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటుకు నోటు ఇతర పంపకాలు, పోల్ మేనేజ్‌మెంట్ నిర్వహణ దానిపై కూడా ఆయా అభ్యర్థులు విజయావకాశాలను బేరీజు వేసుకుంటున్నారు. బూత్‌ల వారీగా పోలైన ఓట్లను బట్టి కూడా ఏ పార్టీకి అనుకూలంగా మారనుందో అంచనాలతో కుస్తీపడుతున్నారు. ఓటర్ల చైతన్యం ప్రస్ఫుష్టంగా కనిపించడం పార్టీ నేతల్లో ఒకింత సంతోషం, మరోపక్క టెన్షన్ పుట్టిస్తోందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

చెత్త పోగేసి.. నిప్పు రాజేసి..!

డంపింగ్ యార్డులుగా రహదారులు
పొగ, దుర్గంధంతో ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - ఆచంట, పెనుమంట్ర

పల్లెలను సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కోట్ల రూపాయలు వెచ్చించినా చెత్తను సేకరించడంలో అధికారులకు చిత్తశుద్ధి కరువవుతోంది. గతంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ, పోడూరు మండలాల్లో చెత్త నిర్వహణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో వానపాములు పెంచేందుకు అణువుగా సిమెంటు తొట్టెలు సైతం ఏర్పాటు చేశారు. షెడ్ నిర్మాణం అనంతరం ఎరువులు తయారీ బాధ్యతలు ఎవరు చేపట్టాలో స్పష్టత లేక అటు మండల పరిషత్, ఇటు పంచాయతీ అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మిగిలాయి. కోట్లాది రూపాయల ప్రజాధనం వృథాగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంపూర్ణ పారిశుధ్యం, స్వచ్ఛ భారత్ నినాదాలు ప్రచార ఆర్భాటాలు తప్ప అంతగా ఫలితాలు కనిపించడం లేదు. ప్రజల్లో కాస్తో కూస్తో అవగాహన కలిగి పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అదే సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలను విస్మరిస్తున్నారు.

మార్టేరు - ఆచంట రహదారి పక్కన చెత్తకు పొగ పెట్టిన వైనం

అరకొర చెత్త సేకరణ..

నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోనూ చెత్తా చెదారాల సేకరణ అంతంతమాత్రంగానే సాగుతోంది. సిబ్బంది కొరత అధికారుల అలక్ష్యం వెరసి నిత్యం పూర్తిస్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు అమలు కావడం లేదు. దీనిపై తగిన పర్యవేక్షణ లేక నానాటికీ తీవ్రతరం అవుతోంది.

డంపింగ్ యార్డుల కరువు..

గ్రామాల్లో చెత్త వేసేందుకు అవసరమైన డంపింగ్ యార్డులు లేకపోవడంతో స్థానిక అధికారులు, సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. గ్రామాల్లో డంపింగ్ యార్డుల కోసం స్థలాలు సేకరించాలని ప్రభుత్వాలు పదేళ్లుగా ఆదేశిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మండల స్థాయిలోనే ఒక ప్రధాన డంపింగ్ యార్డు ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో పెనుమంట్ర మండలంలో దాదాపు రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన చెత్త సేకరణ శుద్ధి కార్యక్రమ ప్రాజెక్టును ఇంకా వినియోగంలోకి తీసుకురాలేదు.

రహదారుల పక్కనే చెత్త కుంపటి..

గ్రామాల్లో చెత్త పోగు చేయడానికి ప్రత్యేక స్థలాల్లేక పంచాయతీ అధికారులు ప్రధాన రహదారిని డంపింగ్ యార్డుగా మార్చేస్తున్నారు. గ్రామాల్లోని చెత్తనంతా రహదారుల మార్జిన్లోకి తరలిస్తున్నారు. దీంతో ప్రతి గ్రామం ప్రవేశంలోనూ, ముగింపు సరిహద్దుల్లోనూ చెత్త దుర్గంధంతో ముక్కుపుటాలు అదురుతున్నాయి. చెత్త మరీ ఎక్కువైనప్పుడు నిప్పు రాజేసి కాల్చేస్తున్నారు. దీంతో దుర్వాసన, పొగతో ఆ దారి గుండా వెళ్లే ప్రయాణికులు కంటి, ఊపిరితిత్తుల సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. మార్టేరు - ఆచంట, మార్టేరు - తాడేపల్లిగూడెం, బ్రాహ్మణచెరువు-వీరవాసరం, తణుకు - నత్తారామేశ్వరం తదితర ప్రధాన రహదారుల పక్కనే నేడు ఇటువంటి దుస్థితి నెలకొంది.

పేరుకుపోతున్న చెత్త..

షెడ్డు నిర్మించిన ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర పంచాయతీల్లో సుమారు 65 వేల మంది జనాభా ఉన్నారు. నిత్యం పంచాయతీ కార్మికులు సుమారు రెండు టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. ఆయా పంచాయతీల్లో డంపింగ్ యార్డులకు స్థలాల కొరత కారణంగా రోడ్లు, కాలువ గట్ల వెంబడి చెత్త వేసేస్తున్నారు. దీంతో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి చెత్త నిర్మూలనకు చిత్త శుద్ధితో కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆత్మీయులను కోల్పోవడం బాధాకరం

మాజీ ఎంఎల్ఎ శివరామరాజు

ప్రజాశక్తి - ఉండి

ఆత్మీయులను కోల్పోవడం బాధాకరమని ఉండి మాజీ శాసనసభ్యులు వేటూరి వెంకట శివరామరాజు అన్నారు. యండగండి మాజీ సర్పంచి చికిలే మణికుమారి భర్త విజయ్‌కుమార్ తల్లి శాంతి కుమారి ఇటీవల మరణించడంతో మణికుమారి కుటుంబాన్ని, సప్పల జాన్‌బాబు కుటుంబాన్ని, మంతెన శ్రీరామ్మూర్తి రాజు కుటుంబాన్ని, గాదిరాజు అన్నపూర్ణమ్మ కుటుంబాన్ని ఉండి మాజీ శాసనసభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ కుటుంబ పెద్ద మరణిస్తే ఆ బాధ వర్ణనాతీతమని అన్నారు. ఆ కుటుంబ సభ్యులు తనకు ఎంతో ఆప్తులని వారికి ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని అన్నారు. ఆ కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు.

వైభవంగా అమ్మవార్ల జాతర

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడు గ్రామ దేవతలైన ఎల్లమ్మ, కొండ్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర కన్నుల పండుగగా బుధవారం జరిగింది. ఐదేళ్లకోసారి ఐదు రోజుల పాటు జరుగనుంది. ఈ జాతరకు పెద్దఎత్తున యాత్రికులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తీన్‌మార్, డప్పు డ్యాన్సుల మధ్య ఉత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన వారిలో ఉత్సవ కమిటీ సభ్యులు వక్కపట్ల హరిబాబు, మంతెన వెంకట రవి వర్మ, సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు, ఎంపిటిసి చిన్నాపరపు రాంబాబు, మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు, సెక్యూరిటీ వాసు, వైసిపి గ్రామ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు, మంతెన రామకృష్ణంరాజు పచ్చిగోళ్ల శ్రీను ఉన్నారు.

మాట్లాడుతున్న వైద్యులు

కిల్కారి యాప్‌పై గర్భిణులకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై అవగాహన కలిగి, కిల్కారి మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకునేలా ఆశా కార్యకర్తలు వారికి అవగాహన కల్పించాలని పెనుమంట్ర పిహెచ్‌సి అధికారులు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ పి.కనకప్రియ అన్నారు. బుధవారం స్థానిక పిహెచ్‌సిలో జరిగిన అవగాహనా కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. గర్భిణులు నాలుగో నెల నుంచి ప్రసవం అయిన ఏడాది వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఈ యాప్ వివరిస్తుందన్నారు. దీని గురించి ఆశా కార్యకర్తలు అందరికీ బాధ్యతగా అవగాహన కలిగించాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ అకాడమీ పనిచేస్తుందని, అవసరం అయినవారు 01244451660/14423 నంబర్లకు ఫోన్ చేయడం ద్వారా ఉచిత సేవలు పొందొచ్చని అన్నారు. ఈ శిక్షణలో ఆరోగ్య కేంద్రం సిహెచ్ఒ, నోడల్ అధికారులు, ఎంపిహెచ్‌ఎస్‌లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తకు ఆర్థిక సాయం అందజేస్తున్న నేతలు

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

మాజీ మంత్రి పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

నిరంతరం టిడిపి కోసం శ్రమ పడే కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంట్ర పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణ చెరువుకు చెందిన సీనియర్ కార్యకర్త గుబ్బల సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని పార్టీ గ్రామ అధ్యక్షుడు గంటా వాసు, ఇతర నాయకుల ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా పితాని బాధితునితో మాట్లాడి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తేతలి గోపిరెడ్డి, కొప్పిశెట్టి సూరయ్య, బోనం సుబ్రమణ్యం, గుడాల కనకారావు, గంజం సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, GOLI SOMA CHAITANYA REDDY (New Name), S/o. Venkata Reddy, previously called **GOLI SOMA CHAITANYA** (Old Name), Resident of H.No. 24B-11-71/1, Venkata Reddy Bhavan, Chinna Sivalayam Road, Pathebada, Eluru - 534002, Eluru District, Andhra Pradesh have changed my name **GOLI SOMA CHAITANYA** (Old Name) to **GOLI SOMA CHAITANYA REDDY** (New Name). Hence after all my Documents and Correspondence will be continue with my New Name **GOLI SOMA CHAITANYA REDDY**, My Phone No. 9440145353.